క్లుప్తంగా

నేడు బ్రోమోడయోలిన్ పంపిణీ

పెదపూడి: మండలంలోని పంట పొలాల్లో సామూహిక ఎలుకల నిర్మూలనకు బ్రోమోడయోలిన్ మందును శుక్రవారం పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ మందు పంపిణీ చేస్తారన్నారు. మండలానికి 81 కిలోల మందు వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటికెళ్లి.. పింఛను ఇచ్చి



పందలపాకలో వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్

బిక్కవోలు: తెలవారుతుండగానే లబ్ధిదారుల ఇంటికెళ్లి వలంటీర్లు పింఛను సొమ్ము అందజేయడంతో వారి మోములో ఆనందం వెల్లివిరిసింది. బిక్కవోలు మండలంలో 83.88 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని అధికారులు తెలిపారు. తొలిరోజు 10,952 పింఛన్లకు గాను 9,186 మందికి అందించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రంగంపేట: వడిశలేరు విద్యుత్తు సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ విద్యుత్తు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వడిశలేరు, ముకుందవరం, ఎస్టీ రాజాపురం గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



బీజేపీలోకి చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న సోము వీర్రాజు

రంగంపేట: మండలంలోని వడిశలేరు, పెదరాయవరం, చంద్రేడు, ఎస్టీ రాజాపురం, ముకుందవరం, రంగంపేట తదితర గ్రామాల నుంచి 20 మంది బీజేపీలో చేరారు. గురువారం బీజేపీ అనపర్తి నియోజకవర్గ కన్వీనర్ ఎంఎస్ఆర్‌కే రాజు ఆధ్వర్యంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీర్రాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అంతా కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం, మద్దిపాటి వరప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్ పాపారావుకు సత్కారం



తహసీల్దార్ పాపారావును సత్కరిస్తున్న సిబ్బంది

మధురపూడి: కోరుకొండ తహసీల్దార్ పెండ్యాల హరిగోపాల్ రామపాపారావు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి బదిలీ అయిన నేపథ్యంలో గురువారం ఆయనను సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సింగినీడి వెంకట నరేష్ (ఇన్‌చార్జి తహసీల్దార్) మాట్లాడుతూ డ్యూటీని కర్తవ్యంగా భావిస్తూ తహసీల్దార్ పాపారావు పనిచేశారన్నారు. మూడేళ్ల మూడు నెలల్లో అందరి మన్ననలు అందుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ హరిబాబు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సర్వేయర్లు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో వడ్డీ రాయితీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)లో 2019–20 సంవత్సరంలో రూ. 3 లక్షల వరకూ వ్యవసాయం రుణం పొంది, వాయిదా లోపు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ ఇవ్వడం జరుగుతుందని సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు తెలిపారు. సొసైటీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాయిదాలోపు చెల్లించిన 713 మంది రైతులకు మూడు శాతం సబ్‌వెన్షన్ వడ్డీ రాయితీ రూ.22,92,542.28 వచ్చిందన్నారు. దీనిని రాజమహేంద్రవరం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచి ద్వారా సంఘ రైతుల సేవింగ్స్ ఖాతాలకు జమ చేయనున్నామన్నారు. సమావేశంలో సంఘ చైర్‌పర్సన్లు చీరా రాజు, ఏలూరి లోకేష్, సీఈవో బొడ్డేడ రాంబాబు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి దోసాలమ్మ కాలనీ సమీపంలోని ఒక నర్సరీలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.14,600 స్వాధీనం చేసుకున్నామని కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. నాలుగు సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు.

ముంపు నుంచి మోక్షానికి..

- రూ.91.10 కోట్లతో బొబ్బిల్లంక వద్ద ఎత్తిపోతల పథకం
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో కార్యాచరణ, టెండర్ల దశలో పనులు

సీతానగరం: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే అవి 'కన్నీటి'లో కొట్టుకుపోతే.. ఆ బాధలు వర్ణనాతీతం. ఏటా వస్తున్న ముంపు నుంచి రైతులు పడిన అవస్థలు అన్నీ ఇన్నీకావు.. వాటి నుంచి విముక్తి కలిగిస్తూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేసిన ఆలోచన పుడమిపుత్రుల కష్టాలు తీర్చనుంది.. వేలాది ఎకరాలు ముంపు నుంచి బయట పడేలా బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు వేగవంతం అయ్యాయి. ఇప్పటికే నిధులు మంజూరు కాగా, టెండర్ల దశలో పనులు వేగంగా సాగుతున్నాయి.

తొర్రిగెడ్డ కాలువలోకి నీరు వచ్చేదిలా..

పలు మండలాల నుంచి వర్షపు నీరు బురద కాలువ, కూనవరం డ్రెన్ నుంచి తొర్రిగెడ్డ కాలువలో కలసి బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి గోదావరిలోకి వెళ్తుంది. గండేపల్లి, రాజానగరం నుంచి వచ్చే నీరు దోసకాయలపల్లి జగ్గప్పచెరువులో కలసి, బూరుగుపూడి వద్ద అయ్యన్నగల్లు నుంచి బురద కాలువ ద్వారా తొర్రిగెడ్డ కాలువలోకి వస్తుంది. అలాగే గంగవరం మండలం నుంచి శ్రీరంగపట్నం మీదుగా కాపవరం నుంచి గుమ్ములూరులో కలసి తొర్రిగెడ్డ కాలువలోకి వస్తుంది. కోరుకొండ నుంచి జంబూపట్నం బలరామయ్య చెరువు నుంచి అయ్యన్నగల్లులో కలుస్తుంది. రంపచోడవరం మండలం నుంచి వచ్చే నీరు దేవీపట్నం మీదుగా రాపాక నుంచి కూనవరం డ్రెన్ ద్వారా ఉండేశ్వరపురంలోని తొర్రిగెడ్డ కాలువలో కలసి బొబ్బిల్లంక స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళ్తుంది.



రాపాక వద్ద కొండ గోదావరి ఎగపోటుతో ముంపు నీట పంట పొలాలు (ఫైల్)

ముంపునకు కారణం ఇదే..

దేవీపట్నం, రంపచోడవరం, కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో కురిసిన వర్షం నీరు, సూరంపాలెం ప్రాజెక్ట్ నుంచి విడుదల చేసిన మిగులు జలాల నీరు బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరుకుని గోదావరిలో కలుస్తాయి. దీనిని కొండ గోదావరి అని అంటారు. అదే సమయంలో అఖండ గోదావరి వరద పోటెత్తి నీటి మట్టం పెరిగితే బొబ్బిల్లంకలోని స్లూయిజ్ తలుపులు ఆటోమేటిక్‌గా మూసుకుపోతాయి. తగ్గితే గేట్లు తెరుచుకుని కొండ గోదావరి నీరు స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళ్తుంది. వరద నీటిమట్టం ఎక్కువగా ఉంటే స్లూయిజ్ గేట్లు మూసుకుపోవడంతో కొండ గోదావరి ఎగపోటుతో నియోజకవర్గంలోని 25 వేల ఎకరాల పంట నీటమునిగి రైతులు నష్టపోతున్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో..

పంట పొలాలు ముంపు బారిన పడకుండా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆలోచన చేశారు. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద తొర్రిగెడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మించి, గోదావరి వరద సమయంలో కొండ గోదావరి నీటిని గోదావరిలోకి ఎత్తిపోస్తే పంట పొలాలను ముంపు నుంచి రక్షించవచ్చని ప్రణాళిక చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో ఉంచి ఎత్తిపోతల పథకానికి రూ 91.10 కోట్లు మంజూరు చేయించారు. ఈ పనులు ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి. ఇది పూర్తయితే సీతానగరం మండలం కూనవరం, రాపాక, చినకొండేపూడి, పెదకొండేపూడి, రఘుదేవపురం, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక, కోరుకొండ మండలంలో జగన్నాథపురం, గుమ్ములూరు, కాపవరం, బూరుగుపూడి, మునగాల గ్రామాల్లో 25 వేల ఎకరాల పంట పొలాలు ముంపు నుంచి బయట పడతాయి.



బొబ్బిల్లంక తొర్రిగడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మించే ప్రాంతం

ఎమ్మెల్యేకి రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రైతులకు ఎంతో మేలు చేశారు. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద తొర్రిగెడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నెలకొల్పి కొండ గోదావరి నీటిని ఎత్తిపోస్తే ఎప్పటికీ పంట పొలాలు ముంపులోకి వెళ్లవు. ఇప్పటి వరకూ ఏ నాయకుడు చేయని పని ఎమ్మెల్యే రాజా చేశారు. ఆయనకు ఎంతో రుణపడి ఉంటాం.

–జొన్నలగడ్డ సత్యనారాయణ, రైతు, మిర్తిపాడు

టెండర్ల దశలో పనులు



బొబ్బిల్లంక వద్ద తొర్రిగడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో ఇప్పటికే రూ.91.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. కొండ గోదావరి ఎగపోటుతో పంట పొలాలు ముంపులోకి వెళ్లేవి. ఎత్తిపోతల పథకం పూర్తయితే 25 వేల ఎకరాలు ముంపు నుంచి బయట పడతాయి.

–ఎ.శివప్రసాద్, ఏఈ, జల వనరులశాఖ

ఆర్థిక స్వావలంబనకు 'వైఎస్సార్ ఆసరా'

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ

రంగంపేట: మహిళల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఆసరా' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధుల పంపిణీ కార్యక్రమాలు గురువారం దొడ్డిగుంట, వెంకటాపురం, సుభద్రంపేట, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాల సర్పంచులు కారి సంజీవరావు, ముంగి గంగరాజు, కూటి సాయితాతారావు, వేము మాధవి, తుట్టా శివశంకర ఆనంద్, నల్లా పద్మ అధ్యక్షతన జరిగాయి. దీనికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని 80 లక్షల స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలకు రూ.25 వేల కోట్ల రుణమాఫీని నాలుగు విడతల్లో చేశారన్నారు. మహిళల అభ్యున్నతి కోసం అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, సున్నా వడ్డీ, కాపునేస్తం, కల్యాణమస్తు, ఇళ్ల పట్టాలు అందిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను, తనను ఆశీర్వదించాలన్నారు. అనంతరం మహిళా లబ్ధిదారులకు ఆసరా నమూనా చెక్కును అందించారు. యానిమేటర్లు, మహిళా శక్తి సంఘాల మహిళలతో కలసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తర్వాత యానిమేటర్లను సత్కరించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత, రైతు విభాగాల కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, రవిశంకర్ పాల్గొన్నారు.



దొడ్డిగుంటలో యానిమేటర్లను సత్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళల సంక్షేమం సాధ్యమైందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇలపల్లిలో నాలుగు విడత వైఎస్సార్ ఆసరా నిధుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలను భాగస్వామ్యం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఇలపల్లిలో 54 గ్రూపుల్లో 528 మంది సభ్యులకు రూ.48.71 లక్షలు అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలన్నారు. సర్పంచ్ లోల్లం భద్రం, నియోజకవర్గ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నాయకుడు సాధనాల రాంబాబు పాల్గొన్నారు.



ఇలపల్లిలో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఎంబీఏలో భానురేఖకు అవార్డు



ఎంబీఏలో అవార్డు తీసుకుంటున్న తేతల భానురేఖ

బిక్కవోలు: కొమరిపాలేనికి చెందిన తేతల భానురేఖకు ఎంబీఏలో అవార్డు వరించింది. గురువారం స్థానికంగా ఆమె మాట్లాడుతూ పిడింగొయ్యిలోని సాయిరాం మేనేజ్‌మెంట్ కళాశాలలో 2019–21 ఏడాది ఎంబీఏ చదివి యూనివర్సిటీ టాప్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన 13, 14, 15 స్నాతకోత్సవంలో వర్సిటీ వీసీ కె.పద్మరాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నానని వివరించారు. ఆమెను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యానారాయణరెడ్డి, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి శేషుకుమారి, సొసైటీ మాజీ అధ్యక్షుడు తాడి అరవిందం, కొమరిపాలెం ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టి కృషి

- పార్టీ పీఏసీ సభ్యురాలు విజయలక్ష్మి
- గాదరాడలో సమావేశం

మధురపూడి: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా సమష్టి కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం గాదరాడలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో అమలు జరిపి, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదలకు కృషి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గాదరాడ అభివృద్ధికి ఈ ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించిందన్నారు. గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులు, మురుగునీటి కాలువల నిర్మాణం చేసినట్టు తెలిపారు. కాగా గతంలో టీడీపీ ప్రభుత్వం కేవలం రూ.1.65 కోట్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు. ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన శ్మశాన వాటికకు మార్గం ఏర్పాటు చేస్తామని, అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి కాలువలు, కల్వర్టులు నిర్మిస్తామన్నారు. సమావేశంలో పార్టీ మండల కో కన్వీనర్ గణేశుల పోశయ్య, నాయకులు హరిబోలు చినబాబు, కె.జయకర్, తోరాట శ్రీను, చీర్ల శివ, కవలపెల్లి శ్రీను పాల్గొన్నారు.



గాదరాడలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీఎం జగన్‌తోనే పథకాల అమలు

రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: రాష్ట్రంలో పథకాలు అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. గురువారం మంజేరు, చేదువాడ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. పేద మహిళలు, వృద్ధులను పలకరించి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నది లేనిది ఆరా తీశారు. మంజేరులో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ నూరుశాతం అమలు చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద సంఖ్యలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో మరిన్ని పథకాలను పొందగలుగుతామన్నారు. పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, గ్రామ సర్పంచులు గుంటూరి అప్పారావు, గంజా దేవి, పీఏసీఎస్ చైర్మన్ గండి కిశోర్, గండి వెంకటేశ్వర్రావు పాల్గొన్నారు.



మంజేరులో పార్టీ శ్రేణులు, స్థానికులతో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో కృష్ణ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది



ఎంపీడీఓ విజయలక్ష్మి



అనపర్తి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న రవికుమార్



ఎంపీడీఓ ఆశాజ్యోతికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఓ, ఈఓపీఆర్డీ

సీతానగరం: ఎంపీడీఓగా కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన కొయ్యలగూడెం మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, కూనవరం ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్, ఈవోపీఆర్డీ మూర్తి, ఏవో గోపాల్, సీనియర్ అసిస్టెంట్ డి.విజయ్ శ్రీనివాస్, కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు శాలువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సీతానగరం నుంచి బదిలీ అయిన ఎంపీడీవో కె.రమేష్‌ను పశ్చిమ గోదావరి జిల్లాలో ఏ మండలానికి కేటాయించిందీ ఇంకా తెలియరాలేదు.

బిక్కవోలుకు విజయలక్ష్మి

బిక్కవోలు: స్థానిక ఎంపీడీఓగా వి.విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ పనిచేసిన జేఏ ఝాన్సీ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడకు విశాఖపట్నం జిల్లా నుంచి విజయలక్ష్మి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను సిబ్బంది అభినందించారు.

అనపర్తికి రవికుమార్

అనపర్తి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా అనపర్తి ఎంపీడీఓగా వీవీ రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఎంపీడీఓగా పనిచేసిన కె.హిమమహేశ్వరి ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ కావడంతో విశాఖ జిల్లా కోటకొట ఎంపీడీఓగా పనిచేస్తున్న రవికుమార్ అనపర్తికి వచ్చారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు మండల పరిషత్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

పెదపూడికి ఆశాజ్యోతి

పెదపూడి: పెదపూడి ఎంపీడీఓగా పి.ఆశాజ్యోతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకూ ఆమె విశాఖపట్నం జిల్లా చింతపల్లి ఎంపీడీఓగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన వీవీ సాయిబాబు చింతపల్లి మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆశాజ్యోతి మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానన్నారు. ఆమెకు ఏఓ చలమయ్య, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎస్ఏ శ్రీనివాసు, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసచౌదరి, ప్రసన్నకుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



రాజానగరంలో బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ జ్యోతిర్మయి

రాజానగరానికి జ్యోతిర్మయి

రాజానగరం: ఎంపీడీఓగా జీపీకేఎస్వీ జ్యోతిర్మయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండల నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జిగా ఉన్న కార్యాలయం సూపరింటెండెంట్ ఎం. సుబ్రహ్మణ్యం ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

4న ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

రంగంపేట: మండలంలోని సుభద్రంపేట, ఈలకొలను గ్రామాల్లో ఈ నెల 4న మధ్యాహ్నం 2.30 గంటలకు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పర్యటిస్తారని మండల పంచాయతీరాజ్ జేఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సుభద్రంపేటలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, ఈలకొలనులో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను వారు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

బడ్జెట్ పేరుతో ఎన్నికల గారడీ

ప్రకాశం నగర్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కేవలం బడ్జెట్ పేరుతో చేసిన ఎన్నికల గారడీ అని సీపీఐ కార్యదర్శి తాటిపాక మధు గురువారం ప్రకటనలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోదీ మరోసారి మొండిచేయి చూపారని, బడ్జెట్‌లో ఏపీ ప్రస్తావన లేనేలేదన్నారు. పదేళ్లలో ఎంతో మోసపోయిన పేదలు, రైతులు, మహిళలు, యువకులు రానున్న ఎన్నికల్లో మోదీని ఓడించడం ఖాయమన్నారు.

ఎంఎస్‌ఈబ్ల్యూ గ్రేడ్-1 అధికారిగా నాగవేణి

కంబాలచెరువు: జీజీహెచ్ ఎంఎస్ డబ్ల్యూగ్రేడ్–1 గెజిటెడ్ అధికారిగా మాగాపు నాగవేణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఏనాడూ సదరు హోదాలో నియమకాలు జరగలేదు. రాజమహేంద్రవరంలో నూతనంగా వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతో అనుబంధ ఆసుపత్రిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ నియామకానికి ఆస్కారం ఏర్పడింది. నాగవేణి రాజమహేంద్రవరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఈమెకు గతంలో అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్, మున్సిపల్ ప్రజారోగ్య విభాగాల్లో కీలక స్థానాల్లో పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు చేపట్టిన ఆమెను మేనేజర్ కేదార్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాల ఉద్యోగులు కలిసి అభినందనలు తెలిపారు.

క్వారీ గోతులు పూడ్చే వరకూ పోరాటం

సీటీఆర్ఐ: స్థానిక 49వ డివిజన్‌లో ప్రమాదకరంగా మారిన క్వారీ గోతులను పూడ్చే వరకూ పోరాటం సాగిస్తానని, ప్రజల రక్షణకు ప్రాణాలైనా ఇస్తానని కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సింహచలం నగర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ముందుగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ క్వారీ గోతులు పూడ్చుతామని, నీళ్లు తోడుతామని అధికారులు తనను మభ్య పెట్టి మోసం చేశారని, ఈసారి ఎవరి మాటకు తలొగ్గేది లేదన్నారు. క్వారీ ఏరియాలోని సింహాచల నగర్‌లో నివాసం ఉంటున్న నాలుగు వేల కుటుంబాల సంక్షేమం కోసం అధికారులు, క్వారీ యజమానులపై పోరాటం చేస్తానన్నారు. ఏ రాజకీయ పార్టీకి, ప్రజాప్రతినిధులకు ఈ ఉద్యమంతో సంబంధం లేదన్నారు. గతంలో తాను ఎక్కడైతే 24 గంటల పాటు దీక్ష చేపట్టానో అదే స్థలానికి ఎవరికి చెప్పకుండా వెళ్లి కూర్చుంటానని, స్పష్టంగా లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే తప్ప ఈ దఫా ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదన్నారు. క్వారీలోని 20 పేటల్లో పోస్టర్లను పంపిణీ చేస్తూ వీధి సమావేశాలు కూడా పెడతానన్నారు. కార్యక్రమంలో సింహచలం ఆటోస్టాండ్ డ్రైవర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రా పేపర్‌మిల్లు సీఎస్ఆర్ నిధులతో 41 డివిజన్ కోటిలింగాల పేటలో 58 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానికులు మర్రి పుష్పరాజు, జేబీ గిరిధర్ అన్నారు. నూతనంగా ఏర్పాటు కుళాయిలను గురువారం కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. డివిజన్‌లో వీధికి నాలుగు చొప్పున మొత్తం 58 కుళాయిలను పేపర్ మిల్లు యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. అలాగే స్థానిక నిరుద్యోగ యువతకు పేపర్ మిల్లులో ఉపాధి కల్పించాలని కోరారు.

జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం ప్రతిపక్షాలకు లేదు

- అందుకే లేనిపోని ఆరోపణలు
- జక్కంపూడి గణేష్

రాజానగరం: రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందిస్తూ, ప్రజాభిమానాన్ని చూరగొంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా ఎదుర్కొనే ధైర్యం ప్రతిపక్షాలకు లేదని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని జి.యర్రంపాలెంలో గ్రామ కమిటీ ప్రతినిధులు, మహిళలు, యువకులతో గురువారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఉనికిని చాటుకోవడం కోసం ప్రతిపక్షాలు లేనిపోని పాట్లు పడుతున్నాయన్నారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. కానీ వాస్తవాలు ఏమిటో ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే కొనసాగుతాయనే విషయం ప్రజలకు తెలియంది కాదన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులలోనూ ఎన్నో ఆర్థిక ఒడుదుడుకులను ఎదుర్కొని, ప్రజలకు అండగా నిలిచింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

అపరిచితులతో పరిచయాలు ప్రమాదకరం

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ అపరిచితులతో బాలికలు పరిచయాలు పెంచుకోకూడదని, అవి ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. అన్యాయాలను ధైర్యంగా ఎదురుకోవాలని, వాటిని సహిస్తూ మౌనంగా ఉంటే పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారిపోతాయన్నారు. అలాగే మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యకరంగా వ్యవహరిస్తే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. పోక్సో చట్టం, 2012 నల్సా, పిల్లలకు స్నేహపూర్వక న్యాయ సేవల సంరక్షణ పథకం 2015 తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి